www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 31 జూలై 2022 | ఎడిటర్ : గోసుకొండ పృథ్విరాజు | సంపుటి - 07, సంచిక-116 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## సులభతర న్యాయం కూడా ముఖ్యమే

- 24గంటలు పనిచేసే కోర్టులను తీసుకొస్తున్నాం
- న్యాయవ్యవస్థ బోలపేతానికి ఎన్నో చర్యలు
- డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీస్ సమావేశంలో ప్రధాని మోడీ
- గడపగడపకూ న్యాయం అందాలన్న చీఫ్ జస్టిస్ రమణ



**న్యూఢిల్లీ, జూలై 30 (సమ సమాజం):** సులభతర వాణిజ్యం, సులభతర జీవనం లాగే సులభతర న్యాయమూ అంతే ముఖ్యం అని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు న్యాయపరమైన మౌలిక సదుపాయాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలను పటిష్ఠం చేసేందుకు గత ఎనిమిదేళ్లుగా శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ఈ-కోర్టు మిషన్‌లో భాగంగా వర్చువల్ కోర్టులను ప్రారంభించాం. ట్రాఫిక్ ఉల్లంఘనల వంటి నేరాలను విచారించేందుకు 24 గంటలూ పనిచేసే కోర్టులను తీసుకొస్తున్నాం' అని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పలు జైళ్లలో న్యాయ సహకారం కోసం ఎదురుచూస్తున్న అండర్‌ట్రయల్ ఖైదీల విడుదలకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని న్యాయస్థానాలను మోదీ కోరారు. ఢిల్లీలో జరిగిన నల్సా తొలి ఆల్ ఇండియా డిస్టిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీస్ సమావేశంలో ప్రధాని మోడీ, చీఫ్ జస్టిస్ట్ ఎన్వి రమణలు పాల్గొన్నారు. ఈ కోర్టు మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా వర్చువల్ కోర్టులను ప్రారంభించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టేందుకు అన్ని కోర్టుల్లో మౌలికసదుపాయాలను విస్తరించినట్లు ప్రధాని తెలిపారు. సమాజంలో న్యాయవ్యవస్థ అందరికీ అందుబాటులో ఉండాలని, న్యాయం కూడా అందరికీ సమానంగా అందాలన్నారు. న్యాయ వ్యవస్థ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు గడిచిన 8 ఏళ్లలో ఎంతో పనిచేశామని మోదీ అన్నారు. జిల్లా న్యాయస్థానాలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ

2వ

## హైదరాబాద్ వదిలి ఢిల్లీలో ఏం చేస్తున్నారు

- ప్రజలు వరద కష్టాలు పడుతున్న పట్టించుకోరా
- మూసీ వరదలపై ఎందుకు నోరు మెదపరు
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ఏమయ్యింది
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి కిషన్ రెడ్డి
- మూసారాంబాగ్ పరిసరాలను పరిశీలించిన మంత్రి



**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** వరదలతో ప్రజలను నానాయాతన పడుతుంటే ఢిల్లీలో మకాం వేసిన సిఎం కెసిఆర్ ఏం చేస్తున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ మూసీ పరివాహకంలో కొందరు మట్టిపోసి ఆక్రమించి షాపులు, ఇతరనిర్మాణాలు చేపట్టినా పట్టించుకోక పోవడం దారుణం అన్నారు. వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి ఢిల్లీలో కూర్చోవటం విచారకరమన్నారు. సీఎం కేసీఆర్ నాలుగు రోజులు ఢిల్లీలో ఏమి చేశారో ప్రజలకు తెలియాలని అన్నారు. శనివారం ఉదయం ముసారంబాగ్ వద్ద మూసీ వరదను కేంద్రమంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పుత్రవాత్సల్యంతో కేసీఆర్ కేంద్రంపై విమర్శలు చేయటం తగదన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనకు కొన్ని రోజులు మాత్రమే మిగిలాయని... ప్రజలు ఇంకోసారి టీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వరని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఎస్డీఆర్ఎఫ్ నిధులపై మంత్రి కేటీఆర్ అవాస్తవాలు చెప్తున్నారని మండిపడ్డారు. మూసీనది ఆక్రమణలను ప్రభుత్వ పెద్దలే ప్రోత్సహి స్తున్నారని ఆరోపించారు. మూసీ ఒడ్డున అక్రమంగా షెడ్డులు వేసి పేదలకు అద్దెకు ఇస్తున్నవారిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళలన చేస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. వరదలతో నష్టపోయిన ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. మూసీకి వరద రావడంతో నీట మునిగిన ముసారాంబాగ్ బ్రిడ్జిని ఆయన పరిశీలించాక ప్రభుత్వం తీరును తప్పు పట్టారు. ఈసారి కూడా భారీ వర్షాల కారణంగా లక్ష ఇళ్లు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది కూడా ఇలాంటి పరిస్థితే తలెత్తిందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏడాది తర్వాత కూడా మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి మార్పులు రాలేదని మండిపడ్డారు. మూసీ డెవలప్ మెంట్ కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసినా.. ఒక్క అడుగు కూడా ముందు పడలేదని చెప్పారు.

3వ

# మునుగోడు ఉప ఎన్నిక ఖాయం

- తెలంగాణ రాజకీయాల్లో మార్పు రావాలి
- రాజగోపాల్‌రెడ్డితో ఉత్తమ్, వంశీచంద్ చర్చలు
- కాంగ్రెస్ పార్టీని వీడొద్దంటూ సూచన
- రాహుల్ దూతలుగా చర్చలు..ఢిల్లీకి రావాలని ఒత్తిడి
- తన పోరాటం కెసిఆర్‌పైనే అంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు



**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** తెలంగాణ కాంగ్రెస్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుగోడులో ఉప ఎన్నిక ఖాయమంటూ ఆయన వ్యాఖ్యా నించారు. శనివారం సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి, పార్టీ ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మునుగోడు ప్రజలు భావిస్తే ఉపఎన్నిక వస్తుందని అన్నారు. మునుగోడు ఉపఎన్నికపై తెలంగాణవ్యాప్తంగా చర్చ జరగాలి. మునుగోడు తీర్పు తెలంగాణలో మార్పున కు నాంది కావాలి. ఆ ఉప ఎన్నికతో తెలంగాణలో తప్పక మార్పు వస్తుంది. నేను కేసీఆర్‌పై ధర్మ యుద్ధం చేస్తున్నా అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే.. ఉత్తమ్, వంశీచంద్‌రెడ్డిలతో ఢిల్లీ రావాలంటూ కాంగ్రెస్ కీలక నేత రాహుల్ గాంధీ, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కబురు పంపినట్లు సమాచారం. అయితే.. కోమటిరెడ్డి మాత్రం అందుకు సుముఖంగా లేనట్లు ఆయన మాటల్ని బట్టి తెలుస్తోంది. మరోవైపు ఆదివారం నుంచి ఆయన తన నియోజకవర్గంలో పర్యటించ నున్నారు. నిజయోకవర్గంలో పర్యటించిన తర్వాతే ఎమ్మెల్యే పదవికి రాజీనామాపై ఆయన ఒక

3వ

## వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ 15 స్థానాలకే పరిమితం

బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ జోస్యం



**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** ఎవరు ఎక్కడ నుంచి పోటీచేయాలో హైకమాండ్ నిర్ణయిస్తుందని బీజేపీ నేత బండి సంజయ్తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకునే సంప్రదాయం బీజేపీలో లేదని ప్రకటించారు. ఉపఎన్నిక రావాలని టీఆర్ఎస్ రాకూడదని కాంగ్రెస్ కోరుకుంటుందని తెలిపారు. ఉపఎన్నికపై ప్రజల అభిప్రాయానికే బీజేపీ కట్టుబడి ఉందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ 15 అసెంబ్లీ స్థానాలకే పరిమితం అవుతుందని జోస్యం చెప్పారు. క్యాసినో సహా అన్ని దందాల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నారని ఆరోపించారు. కాళేశ్వరం లోపాలపై త్వరలో వివేక్ అధ్వర్యంలో ఢిల్లీకి బృందం వెళ్తుందని చెప్పారు. కాళేశ్వరం అవినీతిపై కేంద్ర జలశక్తిమంత్రికి ఫిర్యాదు చేస్తామని తెలపారు. ప్రజలు వరదలతో ఇబ్బందుల్లో ఉంటే.. సీఎం కేసీఆర్ ఫ్యామిలీ విహారయాత్రలా? అని ప్రశ్నించారు. పాతబస్తీపై కేంద్రహోం మంత్రి అమిత్ షా దృష్టి పెట్టారని బండి సంజయ్ పేర్కొన్నారు.

## కెసిఆర్ కుటుంబ పాలనపైనే నా పోరాటం

కాంగ్రెస్ అనేకసార్లు నన్ను మోసం చేసింది

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి, జూలై 30 (సమ సమాజం):** మునుగోడు అభివృద్ధి కోసం ఎలాంటి నిర్ణయానికైనా రెడీ అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన చౌటుప్పల్ - నారాయణపురం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందన్నారు. మునుగోడు నియోజకవర్గ ప్రజల అభిప్రాయం తీసుకున్నాకే రాజీనామాపై నిర్ణయం తీసుకుంటానని.. కాంగ్రెస్ తనను అనేకసార్లు అవమాన పరిచిందని తెలిపారు. మునుగోడులో మూడు టీమ్ లతో సర్వే చేయించు కుంటున్న వారి సర్వేలో.. మునుగోడు ప్రజలు ఏం కోరుకుంటే ఆ నిర్ణయం తీసుకుంటా అన్నారు. మునుగోడు ప్రజలు రాజీనామా చేయమన్నా, రాజకీయ సన్యాసం తీసుకోమన్నా దానికి రెడీ అని చెప్పారు. సీఎం అరాచక పాలనపైనే పోరాటమని.. కేసీఆర్ ను గద్దె దింపేవరకు ఊరుకోనని తెలిపారు. మొదట్లో ఉప ఎన్నిక విషయం తీసింది కెసిఆర్ అని.. మునుగొడులో చాలా సమస్యలు తిస్టా వేశాయన్నారు. ఉప ఎన్నిక ద్వారా అవి తీరుతాయని ప్రజలు భావిస్తే రాజీనామా చేస్తా అన్నారు. ప్రజల అభిప్రాయాన్ని తీసుకోవడం కోసమే మునుగోడు నియోజకవర్గంలో పర్యటన చేస్తున్నానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు.

## కెసిఆర్‌కు భోగాలు తప్ప త్యాగాలు తెలియవు

- విద్యార్థులకు పురుగులన్నం పెడతారా
- ట్విట్టర్ వేదికగా మండిపడ్డ రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** కేసీఆర్‌కు భోగాలు తప్ప త్యాగాలు తెలియవని మల్కాజ్ గిరి ఎంపీ, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇటీవల జరిగిన ఫుడ్ పాయిజన్ పై కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషితమైన ఆహారం తిని మొత్తం 36మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన అధికార పార్టీ టీఆర్ఎస్ పై తీవ్ర విమర్శలు చేశారు. పురుగలన్నం పెట్టి పేదపిల్లల ప్రాణాలతో చెలగాటమాడే సర్కారును ఏ పదాలతో విమర్శించాలి? అంటూ ఆగ్రహంచెందారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ కు భోగాలు తప్ప త్యాగాలు తెలియవని విమర్శించారు. అసలు ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు పిల్లల ప్రాణాల విలువ తెలుసా అని ప్రశ్నించారు. పేద బిడ్డలకు నాణ్యమైన బుక్కెడు బువ్వ పెట్టలేని పాలన దేనికి? అని దుయ్యబట్టారు. భోజనం తినేముందు ఆత్మపరిశీలన చేసుకో కేసీఆర్ అంటూ రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు గురుకుల పాఠశాలలో కలుషితాహారం తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు లోనవుతూనే ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ట్విట్టర్ వేదికగా... 'పురుగలన్నం పెట్టి పేద పిల్లల ప్రాణాలతో చెలగాటమాడే సర్కారును ఏ పదాలతో విమర్శించాలి?... భోగాలు తప్ప త్యాగాలు తెలియని కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు పిల్లల ప్రాణాల విలువ తెలుసా?.. పేద బిడ్డలకు నాణ్యమైన బుక్కెడు బువ్వ పెట్టలేని పాలన దేనికి? భోజనం తినేముందు ఆత్మపరిశీలన చేసుకో కేసీఆర్' అంటూ రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## మాతృభాషలోనే విద్యాభ్యాసం సాగాలి



- అన్ని భాషాలూ నేర్చుకోవాల్సిందే
- మన సంస్కృతి,సంప్రదాయాలను వీడరాదు
- ఆరోగ్యం కోసం యోగా చేయాల్సిందే
- హైదరాబాద్ పబ్లిక్ స్కూస్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో వెంకయ్య

**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** అన్ని భాషలూ నేర్చుకోవాలి... కానీ మాతృభాషను మరిచిపోకూడదని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. సంగీతం, సాహిత్యం మన రోజు వారి జీవితంలో భాగం అవ్వాలని వెంకయ్య చెప్పారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ఉప రాష్ట్రపతి వెంకయ్య, తెలంగాణ హోమ్ మినిస్టర్ మహమ్మద్ అలీ శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో మాతృభాషపై తనకున్న మమకారాన్ని మరోసారి వ్యక్తం చేశారు. మాతృభాషపై పట్టుండాలి... బేసిక్ విద్యాభ్యాసం మాతృభాష లోనే ఉండాలని తెలిపారు. దేశంలో అత్యున్నత స్థాయిలో ఉన్న వారు ఎవరూ ఇంగ్లీషు మీడియంలో చదవలేదని, అయినా ఉన్నత స్థాయికి వచ్చారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ స్కిల్స్ పెంచుకోవాలన్న ఆయన.. క్యారెక్టర్ ని బిల్డ్ చేసుకోవాలని

2వ

## సంపాదకీయం

# నీటిని ఒడిసి పట్టే సంకల్పం కావాలి

ఇటీవలి వర్షాలతో దేశవ్యాప్తంగా వరదలు ముంచెత్తాయి. ప్రాజెక్టుల్లో నిల్వచేయలేనంతగా ముంచెత్తాయి. ప్రాజెక్టులు ఉన్నా నీరు నిలుపుకునే స్థితి లేదు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో దేశంలో నీటి వినియోగంపై చర్చించాలి. నదీజలాలు, వర్షాలను లెక్కకట్టి అసవరమైనచోట నీటి నిల్వకు ప్రాజెక్టుల ను కట్టాలి. ఉదార పథకాలతో ప్రజల సొమ్మును వృధా చేయకుండా ప్రాజెక్టుల ద్వారా నీటిని నిల్వ చేసుకోవడమే గాకుండా సాగు,తాగునీటి అవసరాలు తీరేలా చేసుకోవాలి. దేశానికి అసవరమైన నీటి నిల్వలు ఉన్నా వాటిని ఉపయోగించుకోవడంలో విఫలం అయ్యాం. 75 ఏళ్ల స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటున్న వేళ జలవిధానంపై చర్చించాలి.అలాగే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నాయి. జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు తరలిపోతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవలి వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి. వ్యవసాయంపై కూడా జాతీయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు తగ్గించుకుని మన రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. కరోనా నేర్పిన గుణపాఠం మనకు అనుభవం కావాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను మింగిన పాపానికి ఇటీవల కురిసిన వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. ఇకపోతే కరోనా నేపథ్యంలో మనం మన వ్యవసాయాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఆలోచనలు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతులు చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలి. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగమించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడిముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపనిగా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. కరోనాతో ఇప్పుడు నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వారిని వ్యవసాయంలో స్థిరపడేలా చేయాలి. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక,అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహిం చాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. కరోనాతో ఇప్పుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకు నేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్దిగా ఎదిగేలా చేయాలి. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్తిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్దంగా ఉంటున్నారు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా ధరలు రాక నష్ట పోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభిస్తూనే ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. ఈ విధానాలకు స్వస్తి పలికి నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయాలి. అందుకు జాతీయ జలవిధానం ప్రధాన అవసరమని గుర్తించాలి. జలవిధానంతో నదులను దారి మళ్లించగలిగితే నీటి కటకటలు రావు. ఈ యేడు వర్షాలు విపరీతంగా పడడమే గాకుండా వరదలు పొంగి నదులన్నీ ఉప్పొంగుతున్నాయి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి.

పృథ్వీరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మంత్రి సత్యవతికి ఎర్రబెల్లి పరామర్శ



**మహబూబాబాద్, జూలై 30 (సమ సమాజం):** మాతృవియోగంతో బాధలో ఉన్న మంత్రి సత్యవతి రాథోడ్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. మంత్రి సత్యవతి మాతృమూర్తి గుగులోత్ దస్మా పార్థీవదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్దాంజలి ఘటించారు. ఆమె మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గుగులోత్ దస్మా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను మంత్రి ఎర్రబెల్లి ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని హాస్టల్ వాన్‌కు సూచించారు. కాగా, ఇదే పాఠశాలలో ఇటీవల ఆహారం వికటించి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

# సులభతర న్యాయం కూడా ముఖ్యమే

(మొదటి పేజి తరువాయి) రమణ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా న్యాయ ఉద్యమాన్ని చేపట్టడంలో జిల్లా కోర్టులు చోదకాలుగా పనిచేస్తాయన్నారు. చాలా వరకు కేసుల్లో జిల్లా జుడిషియల్ అధికారులే కాంటాక్ట్‌లోకి వస్తారని, జిల్లా న్యాయస్థానాల వద్ద తమకు కలిగిన అనుభవాల ద్వారానే న్యాయవ్యవస్థపై ప్రజల్లో ప్రజాభిప్రాయం ఏర్పడుతుందని ఆయన అన్నారు. జిల్లా న్యాయవ్యవస్థను బలోపేతం చేయడం ఇప్పుడు అత్యంత అవసరమని, దేశంలో న్యాయ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో జిల్లా న్యాయస్థానాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. న్యాయాన్ని ప్రజల ఇంటి గడపకు చేర్చగలిగేలా జిల్లా స్థాయిలో న్యాయవ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని జస్టిస్ రమణ అభిప్రాయపడ్డారు. దేశంలో చాలా మంది ప్రజలు న్యాయవ్యవస్థపై సరైన అవగాహన లేక, న్యాయ సహకారం అందక మౌనంగా బాధపడుతున్నారని అన్నారు. న్యాయ ప్రక్రియలో చాలా మంది ప్రజలకు అతి దగ్గరగా ఉండేది జిల్లా న్యాయ సేవల అధికారులే. న్యాయస్థానాలపై ప్రజల అభిప్రాయం.. జిల్లా స్థాయిలో న్యాయాధికారుల నుంచి వారికి ఎదురయ్యే అనుభవాలపై ఆధారపడి ఉంటుంది. జిల్లాల్లో న్యాయవ్యవస్థలను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. న్యాయాన్ని ప్రజల ఇంటి గడపకు చేర్చగలగాలి. అలా చేర్చగలిగితే మనమంతా న్యాయమూర్తులు, లాయర్లు, ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేయాలని సీజేఐ జస్టిస్ రమణ అన్నారు. సందర్భంగా దేశ యువతపై సీజేఐ ప్రశంసలు కురిపించారు. 'ఈ దేశ నిజమైన బలం యువతలోనే ఉంది. ప్రపంచంలో ఐదోవంతు యువత మన దేశంలోనే ఉంది. అయితే మన శ్రామిక శక్తిలో నైపుణ్యవంతులు కేవలం 3 శాతం మాత్రమే ఉన్నారు. మిగతావారిలోనూ నైపుణ్యాలను పెంచి ఆ శక్తిని ఉపయోగించుకోవాలి' అని చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడరు



మునుగోడు ఉప ఎన్నిక రాదు

కాంగ్రెస్‌లో ఉంటూనే టిఆర్ఎస్‌పై పోరాడుతారు

ఎఐసిసి కార్యదర్శి వంశీచంద్ రెడ్డి విశ్వాసం

**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడటం దాదాపు ఖాయమైన పరిస్థితుల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో రాజకీయాలు వేడెక్కాయి. చర్చించేందుకు దిల్లీకి రావాలని ఆపార్టీ అధిష్ఠానం ఆహ్వానించినా ఆయన వెళ్లకపోవడంతో కాంగ్రెస్ పెద్దలు బుజ్జగింపులు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ఆ పార్టీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. రాజగోపాల్ రెడ్డితో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి పార్టీని వీడరని వంశీచంద్‌రెడ్డి స్పష్టం చేశారు. మునుగోడు శాసనసభ్యులు రాజగోపాల్ రెడ్డి కరుడుగట్టిన కాంగ్రెస్ వాదని.. పార్టీని వీడడని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి స్పష్టం చేశారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయరని.. ఉప ఎన్నిక వచ్చే అవకాశం లేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రాజగోపాల్‌రెడ్డి నివాసంలో భేటీ అనంతరం ఆయన ఈ మేరకు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డిని తాను రోజూ కలుస్తానని వంశీచంద్‌రెడ్డి తెలిపారు. తెరాసతో కొట్లాడేది కాంగ్రెస్ పార్టీనే అని స్పష్టం చేశారు. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉండి తెరాసతో కొట్లాడతాడన్నారు. రాజగోపాల్‌రెడ్డి పార్టీ మార్పుపై ఇటీవల బండి సంజయ్ మాటలు ఉత్తవేనని కొట్టిపారేశారు. రాజగోపాల్ రెడ్డి పార్టీ వీడడు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడు. ఉప ఎన్నిక వచ్చే అవకాశం లేదని వంశీచంద్ నమ్మకంగా చెప్పారు. రాజగోపాల్ రెడ్డి ఇంటి పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తల నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డిని బుజ్జగించినట్లు తెలుస్తోంది. తెరాస పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించే దిశగా వేస్తున్న అడుగుల్లో రాజీ పడేది లేదని శుక్రవారం రాజగోపాల్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. రాజీనామా, మునుగోడు ఉపఎన్నిక ఖాయమనే అంశాలను తేల్చి చెప్పారు. సొంత ప్రయోజనాలు, పదవులు తన లక్ష్యం కాదని పేర్కొంటూ ఇటీవల వస్తున్న విమర్శపై స్పందిస్తూ.. తన నిర్ణయాన్ని మునుగోడు నియోజకవర్గ ప్రజలతో పాటు అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయంటూ కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరే అంశాన్ని పరోక్షంగా పేర్కొన్నారు. మరో కురుక్షేత్ర యుద్దానికి సమర శంఖం పూరించాలంటూ మునుగోడు ఉప ఎన్నిక ఖాయమన్నట్లు సంకేతాలిచ్చారు.

# బాసర ట్రిపుల్ ఐటిలో ఇన్సూరెన్స్ కుంభకోణం

విద్యార్థి సంజయ్ కిరణ్ మృతితో వెలుగులోకి □ ప్రీమియం వసూలు చేసి వెనకేసుకున్న అధికారులు


**నిర్మల్, జూలై 30 (సమ సమాజం):** జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీ యాజమాన్యం మరో నిర్వాకం బయటపడింది. ఇన్సూరెన్స్ పేరుతో మేనేజ్ మెంట్ భారీ కుంభకోణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. గతేడాది సెప్టెంబర్ 1న ఇన్స్యూరెన్స్ పేరుతో అధికారులు ఒక్కో విద్యార్థి నుంచి రూ.700 చొప్పున వసూలు చేశారు. అయితే ఇన్స్యూరెన్స్ ప్రీమియం మాత్రం కట్టలేదు. ఇటీవల ఫుడ్ పాయిజన్ కారణంగా మృతి చెందిన విద్యార్థి సంజయ్ కిరణ్ తో పాటు అనారోగ్యానికి గురైన స్టూడెంట్స్ పేరెంట్స్ నిలదీయడంతో నిర్లక్ష్యం బయట పడింది. ఇన్సూరెన్స్ చెల్లించలేదన్న విషయాన్ని డైరెక్టర్ నిర్థారించారు. విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీయడంతో ట్రిపుల్ ఐటీ యాజమాన్యం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. బాసర ట్రిపుల్ ఐటీ యాజమాన్యం ఇన్స్యూరెన్స్ పేరిట విద్యార్థుల నుంచి ఏటా దాదాపు రూ.56 నుంచి 60 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రీమియం చెల్లింపు విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారుల వైఖరి కారణంగా ఈ మధ్యనే ఫుడ్ పాయిజన్ కారణంగా చనిపోయిన స్టూడెంట్ సంజయ్ కిరణ్ తో పాటు అనారోగ్యానికి గురైన విద్యార్థులు ఇన్స్యూరెన్స్ ÷-లకెయిమ్ చేసుకోలేక నష్టపోయారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం ఇన్నేళ్లుగా ఇన్స్యూరెన్స్ పేరుతో వసూలు చేసిన డబ్బుల లెక్క చెప్పాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.




# కోమటిరెడ్డివి మైండ్‌గేమ్ రాజకీయాలు

కాంగ్రెస్‌లో గెలిచి బిజెపితో జతకట్టేందుకు యత్నాలు

మండిపడ్డ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్



**న్యూఢిల్లీ, జూలై 30 (సమ సమాజం):** కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డివి మైండ్ గేమ్ రాజకీయాలు చేస్తున్నారని టీఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మండిపడ్డారు. కాంగ్రెస్ నుంచి గెలిచి.. బీజేపీతోనే అభివృద్ధి అంటూ మైండ్ గేమ్ ఆడుతున్నాడని ధ్వజమెత్తారు.ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో లింగయ్య యాదవ్ శనివారం మీడియాతో మాట్లాడారు. గత రెండు, మూడు నెలల నుంచి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నియోజకవర్గ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. కోమటిరెడ్డి ఏ పార్టీలోకి వెళ్లినా తమకు సంబంధం లేదు. కానీ తమ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ మూడున్నరేండ్లలో ఎన్నిసార్లు నియోజకవర్గంలో పర్యటించావు అని నిలదీశారు. ఏ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నావా? అని ప్రశ్నించారు. మునుగోడు నియోజకవర్గంలో తాను, జిల్లా మంత్రి జగదీశ్ రెడ్డి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నామని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు కనబడకుండా పోయావని పేర్కొన్నారు. బాధ్యతగా టీఆర్ఎస్ ప్రభుత్వం మునుగోడులో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎన్నిసార్లు పిలిచినా రాజగోపాల్ రెడ్డి రాలేదని గుర్తు చేశారు. పేద ప్రజలకు ఇచ్చే కల్యాణలక్ష్మి చెక్కులు కూడా పంపిణీ చేయలేదన్నారు. ఎక్కడెక్కడో కాంట్రాక్టు పనులు చేసుకుంటూ తిరుగుతున్నాడని లింగయ్య యాదవ్ పేర్కొన్నారు. మునుగోడు ప్రజలు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని లింగయ్య యాదవ్ స్పష్టం చేశారు. ఎప్పుడు ఎన్నిక వచ్చిన టీఆర్ఎస్ పార్టీనే గెలుస్తుందన్నారు. మునుగోడులో ఎగిరిదే గులాబీ జెండానే అని తేల్చిచెప్పారు. నిన్ను గెలిపించినందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబమంతా రాజకీయాల్లో ఉండి.. వ్యాపారాల కోసం ఆ పార్టీ.. ఈ పార్టీ అని చూస్తున్నారని లింగయ్య యాదవ్ ధ్వజమెత్తారు.

# ఢిల్లీలో మళ్లీ పాతవిధానంలో లిక్కర్ అమ్మకాలు



**న్యూఢిల్లీ, జూలై 30 (సమ సమాజం):** ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ సర్కార్ మళ్లీ పాత లిక్కర్ విధానాన్ని అమలు చేయనున్నది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఆ విధానం అమలు అవుతుందని డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తెలిపారు. ఢిల్లీలో నాటు సారా విషాదాలను సహించబోమని, అందుకే కొత్త లిక్కర్ విధానం బదులుగా, మద్యాన్ని పాత పద్ధతిలోనే అమ్మనున్నట్లు సిసోడియా తెలిపారు. కొత్త విధానాన్ని సమర్థించిన సిసోడియా.. అవినీతిని అడ్డుకు నేందుకు ఆ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎక్సైజ్ పాలసీ గడువు ముగుస్తున్న తరుణంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఇటీవల గుజరాత్‌లో కల్తీ మద్యం తాగి 42 మంది మరణించారు. అయితే అలాంటి సంఘటనలు ఢిల్లీలో జరగనివ్వబోమని సిసోడియా స్పష్టం చేశారు. లీగల్‌గా మద్యాన్ని అమ్మడం నిలిపివేస్తే, అప్పుడు గుజరాత్ లాంటి ఘటనలు జరుగుతాయని ఆయన అన్నారు.

# మాతృభాషలోనే విద్యాభ్యాసం సాగాలి

(మొదటి పేజి తరువాయి) సూచించారు. భవిష్యత్ లో ఎదుగుదలకు క్రమశిక్షణ, సమయ పాలన అత్యంత అవసరమని తెలిపారు. తాను చూసిన చాలా పాఠశాలల్లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ చాలా ప్రత్యేకమైనదనిగా వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శారీరకంగా దృఢంగా ఉంటేనే మానసికంగా అలర్ట్ గా ఉంటామని, రోజూ మన శరీరానికి వ్యాయామం అవసరమని ఉప రాష్ట్రపతి వెంకయ్య అన్నారు. యోగ అనేది మోడీది కాదన్న ఆయన.. మనబాడీ కోసం వ్యాయామం చేయాలని చెప్పారు. వ్యాయామానికి కుల మతాలు లేవని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజూ వారిజు వారీ జీవితంలో జంక్ ఫుడ్ కాకుండా మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. నేచర్ చాలా ముఖ్య మైనదని... నేచర్ ని నెగెలేక్ట్ చేస్తే చాలా ప్రమాదమని వెంకయ్య హెచ్చరించారు. కల్చర్ ను, ప్రకృతిని ప్రేమిస్తూ జీవిస్తేనే మనకు భవిష్యత్ ఉంటుందని చెప్పారు. గతంలో మన భారత దేశం ప్రపంచంలోనే ధనిక దేశంగా ఉండేదన్నారు. జీవితంలో వ్యక్తిత్వం పెంచుకోవాలని, పక్క వారి కోసం జీవించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదాయాన్ని పెంచుకో... పక్క వారితో పంచుకో అనే మాటను విద్యార్థులకు తెలియజేశారు. చదువు కోసం చాలా మంది విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని.. ఒక వేళ వెళ్లినా దేశం కోసం పని చేయడానికి మాతృ దేశానికి రావాల్సిందేనని చెప్పుకొచ్చారు. ఉపాధ్యాయులు విద్యతో పాటు వినయం, విలువలను నేర్పాలని ఈ సందర్భంగా వెంకయ్య చెప్పారు. మర్యాద నేర్చుకోమన్న ఆయన.. పక్క వారికి సహాయం చేసే అలవాటు చేసుకోండని సలహా ఇచ్చారు. అన్ని రాష్ట్రాల్లో ఆక్రమణలు పెరిగాయన్న ఆయన... మూసీ నది ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయని స్పష్టం చేశారు.

# వీఆర్ఏల నిరవధిక దీక్షకు మద్దతుగా మర్రి నిరంజన్



**ఇబ్రహీంపట్నం, జూలై 30 (సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా మండల కేంద్రము తహసిల్దార్ కార్యాలయం వద్ద ఇబ్రహీంపన్నంలో మండలానికి చెందిన వీఆర్ఏలు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డివిజన్ ప్రధాన కార్యదర్శి బుద్ధి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి, సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పగడాల యాదయ్య పాల్గొనడం జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ వీఆర్ఏలకు ప్రగతి భవన్ అసెంబ్లీలో ఉన్నాయో వెంటనే అమలు చేయాలని న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే విధంగా చూడాలని వీఆర్ఏల స్కేల్ జీవోలను వెంటనే అమలు చేయాలని అర్హత కలిగిన వీఆర్ఏలను ప్రమోషన్ కల్పించి 55 సంవత్సరాల నుండిన వీఆర్ఏల స్థానంలో కుటుంబంలో ఒక్కొక్కరి ఉద్యోగాలు కల్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ నాయకులు, సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పగడాల యాదయ్య వీఆర్ఏలకు మద్దతు ఇస్తూ ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ, వీఆర్ఏలకు ప్రభుత్వం నుంచి వచ్చే స్కేల్ ఏదైతే ఉందో ప్రభుత్వం అమలుపరిచే విధంగా కృషిచేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో విఫలమైందని అందులో భాగంలో వీఆర్ఏల కు కూడా అన్యాయం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెన్నార్ యువసేన అధ్యక్షులు కమలాకర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల వీఆర్ఏ జేఏసీ అధ్యక్షుడు చీమల కరుణేశ్వర్, ఉపాధ్యక్షులు పడాల ఇబ్రహీం, బుద్ధి యాదగిరి, రాజేందర్, కొమ్ము శివకుమార్, సూరంపల్లి శ్రీను, అంకర్ల విష్ణు, దేవేందర్, భాస్కర్, దీప, జాఫర్, గాలయ్య, లింగస్వామి, బాలరాజ్, సునీత, హేమలత, పద్మ, జంగయ్య, పద్మ ,పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రెండోరోజూ కొనసాగిన జ్యోతిరాదిత్య పర్యటన

➤కేంద్ర ప్రభుత్వ పథకాలపై లబ్దిదారులతో సమావేశం

➤స్థానిక యువతతో మోడీ కార్యక్రమాలపై చర్చ

**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** నగరంలో కేంద్ర మంత్రి సింధియా జ్యోతిరాదిత్య సింధియా పర్యటన కొనసాగుతోంది. మలక్ పేట్, చాంద్రాయణగుట్ట, గోషామహాల్, చార్మినార్, కార్వాన్ అసెంబ్లీ పరిధిలో జ్యోతిరాదిత్య సింధియా పర్యటన కొనసాగింది. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో సమావేశమ య్యారు. భాగ్యలక్ష్మి అమ్మవారిని సింధియా దర్శించుకున్నారు. రెండు రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగింది. లోక్‌సభ ప్రవాస్ యోజనలో భాగంగా హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ సింధియా.. పాతబస్తీలో కార్యకర్తలు, పార్టీ నేతలతో భేటీ అవుతున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ బలోపేతంపై ఆయన చర్చిస్తున్నారు. అందులో భాగంగా పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పర్యటనకు సంబంధించిన విషయాలను ఆయన సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. శనివారం గౌలిగూడలోని ఉస్మాన్ షాహిలోని శ్రీ జంగిల్ విఠోబా దేవాలయాన్ని సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ ప్రజలు ఆనందంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు ఆయన వెల్లడించారు. బీజేపీ తెలంగాణలోని 7 ఫ్రంట్‌ల అధ్యక్ష, కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఎదుర్కొంటున్న సవాళ్లపై వారితో ఆయన చర్చించారు. త్వరలోనే జరిగే ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి.. సూచనలు, సలహాలు అందచేశారు. చార్మినార్ ప్రాంతానికి చేరుకున్న సింధియా.. కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్ ను సందర్శించారు. మూడో డోస్ తీసుకుంటున్న వారితో ఆయన ముచ్చ టించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కోవిడ్ వ్యాక్సినేషన్ లు రాష్ట్రాలకు పంపించడం జరుగుతోందని అక్కడున్న వారికి వివరించారు. వ్యాక్సిన్ లు భారతదేశంలోనే తయారు చేయబడ్డా యన్నారు. అక్కడి నుంచి నేరుగా కార్వాన్ ప్రాంతానికి చేరుకున్నారు. సత్యనారాయణ నగర్‌లో యువకులతో నిర్వహించిన సమావేశంలో సింధియా పాల్గొని ప్రసంగించారు. మొదటిసారిగా ఓటు వేయడానికి అర్హులైన యువతను కలుసుకుని వారి కోరికలు, ఆంక్షాంక్షలు తెలుసుకోవడం జరిగిందన్నారు. అనంతరం బీజేపీ విధానాలు, కేంద్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను వారికి వివరించారు. వరి గింజలపై చిత్రాలు గీసే కళాకారుడిని ఆయన కలుసుకున్నారు. అతని గీసిన చిత్రాలను చూసి మంత్రముగ్ధుడను అయ్యాయని, భారతీయ కళను సజీవంగా ఉంచుతున్న కళాకారులకు వందనం తెలియచేస్తున్నట్లు తెలిపారు.

# హైదరాబాద్ వదిలి ఢిల్లీలో ఏం చేస్తున్నారు



(మొదటి పేజి తరువాయి) ప్రాజెక్టు రిపోర్టు రెడీ అయిందని లోన్లు వస్తున్నాయని చెప్పడం మినహా కేసీఆర్ సర్కారు చేసిందేమీలేదని అన్నారు. రాత్రి సమయంలో మట్టి పోసి మూసీ పరివాహక ప్రాంతాలను ఆక్రమిస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఆ కారణంగానే పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి మూసీ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని చెప్పినా కేసీఆర్ సర్కారు పట్టించుకోవడం లేదని కిషన్ రెడ్డి మండిపడ్డారు. గుజరాత్ లోని సబర్మతి నదిని పరిశీలించి వచ్చిన మంత్రులు మూసీపై రోడ్లు వేసి సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వరదల కారణంగా నష్టపోయిన వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇకపోతే భారీ వర్షాలతో నగరం ఆగమాగమైనా ముఖ్యమంత్రి మాత్రం బయట అడుగుపెట్టకపోవడం విచారకరమని కిషన్ రెడ్డి అన్నారు. ఒకవైపు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంటే ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం మాత్రం రాజకీయ ఆలోచనలపైనే దృష్టి పెట్టారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఢిల్లీలో కేసీఆర్ నాలుగు రోజుల పాటు ఎవరికీ కనిపించకుండా ఏం చేశారని నిలదీశారు. నరేంద్రమోడీని ఎంత విమర్శిస్తే టీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబం పట్ల ప్రజల్లో అంత వ్యతిరేకత పెరుగుతుందని అన్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు మంచి పనులు చేయాలని సూచించిన కిషన్ రెడ్డి ఏడాది తర్వాత తెలంగాణ ప్రజలు ఎలాగైనా కేసీఆర్ కుటుంబానికి అవకాశమివ్వరని చురకలంటించారు.

# ప్రజల ఆకాంక్షలను దెబ్బతీసిన కెసిఆర్

## ఆయన ఓటమే తన ప్రథమ లక్ష్యం : ఈటెల



**కరీంనగర్, జూలై 30 (సమ సమాజం):** తెలంగాణ ఆశలను, ఆకాంక్షలను దెబ్బతీసి, సొంత కుటుంబ సంక్షేమానికి పాటుపడుతున్న కెసిఆర్ ఓటమే తన లక్ష్యమని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మరోసారి ప్రకటించారు. కేసీఆర్ రాష్ట్ర ప్రజల విశ్వాసం కోల్పోయారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీఆర్ఎస్‌ను బ్రహ్మదేవుడు కూడా కాపాడలేదని, ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా ప్రజాగ్రహానికి గురికాక తప్ప దన్నారు. తన సవాల్‌ను స్వీకరించి సమాధానం చెప్పే దమ్ములేక కేసీఆర్, తన బానిసలతో ప్రెస్‌మీట్‌లు పెట్టించి అవమానకరమైన భాష మాట్లాడించారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌ను ఓడగొట్టడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్‌ను రాజకీయంగా ఓడగొట్టకపోతే తన జన్మకకు అర్థం లేదని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ రాకెట్ కంటే వేగంగా దూసుకుపోతోందని తెలిపారు. కేసీఆర్‌పై హుజురాబాద్ లేదా గజ్వేల్ ఎక్కడైనా సరే తాను పోటీకి సిద్ధమని సవాల్ విసిరారు. కేసీఆర్ పోటీకి దిగుతానని పదేపదే ఈటల ప్రకటిస్తూ వస్తున్నారు. దమ్ము, ధైర్యం ఉంటే హుజూరాబాద్ గడ్డపై పోటీకి రావాలని సవాల్ విసిరిన విషయం తెలిసిందే. టీఆర్ఎస్ లో కేసీఆర్ కంటే తనకే ఎక్కువ వ్యక్తిగత పరిచయాలున్నాయని వెల్లడించారు. మరోవైపు తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు కమలనాథులు బహుముఖ వ్యూహాలు రచిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ నిర్వహించిన అంతర్గత సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే పార్టీకి 30 సీట్ల వరకు వస్తాయని తేలినట్లు సమాచారం. ఈ క్రమంలో రాబోయే మూడు నెలలు తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ఉధృతంగా పర్యటించి, పార్టీని పటిష్ఠం చేసిన తర్వాత పరిస్థితిలో గుణాత్మకమైన మార్పు వస్తుందని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తోంది. తెలంగాణలో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశాలూ ఉన్నందున డిసెంబరులోపు ప్రతి గ్రామంలోనూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని యోచిస్తోంది. కేసీఆర్ వ్యతిరేక ఓటును బీజేపీ వైపు తిప్పుకొనేందుకు కమల దళం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బీజేపీని అభిమానించే వివిధ భాషలు, సంస్కృతులకు చెందిన వారు తెలంగాణలో ఉన్నారు. వారిని సంఘటితం చేసుకోవాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. తెలంగాణలో ఉన్న సీమాంధ్రులను ఆకర్షించేందుకు బీజేపీ యత్నిస్తోంది. ఏపీలో జగన్ నేతృత్వంలోని వైసీపీతో కేంద్రం సత్సంబంధాలు ఏర్పరచుకోవడంపై సీమాంధ్రకు చెందిన అనేకమంది తెలంగాణలో బీజేపీని వ్యతిరేకించవచ్చునని, అలా జరగకుండా చూసుకునేందుకు పలువురు సీమాంధ్ర ప్రముఖులతో సంబంధాలు పెంచుకోవాలని భావిస్తోంది.

# మునుగోడు ఉప ఎన్నిక ఖాయం

(మొదటి పేజి తరువాయి) ప్రకటన చేస్తారని తెలుస్తోంది. ఇదే సందర్భంలో ఉత్తమ్,వంశీచంద్‌లతో చర్చలు పెద్దగా ఫలించలేదని సమాచారం. ఈ క్రమంలోనే మునుగోడుకు ఉప ఎన్నిక రావడం పక్కా అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంకేతాలిచ్చారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడి వెళ్ళిన తరవాత మునుగోడు ప్రజలు నిర్ణయించిన తర్వాత యుద్ధం ప్రకటిస్తానని స్పష్టం చేశారు. కేసీఆర్ కోరుకుంటే కాదు.. మునుగోడు ప్రజలు కోరుకుంటే ఉప ఎన్నిక వస్తదని రాజగోపాల్ అన్నారు.. కేసీఆర్ కుటుంబ పాలనకు వ్యతిరేకంగానే తన పోరాటమని చెప్పారు. అధికార టీఆర్ఎస్ నేతలు ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కుతున్నారని రాజగోపాల్ మండిపడ్డారు. తాను చేయబోయే యుద్ధం పార్టీల మధ్య కాదని, ప్రజలు కేసీఆర్‌కు మధ్య జరిగే యుద్ధమని అన్నారు. మునుగోడు ప్రజలు నిర్ణయించిన తర్వాతే యుద్ధం ప్రకటిస్తానని స్పష్టం చేశారు. అభివృద్ధి కేవలం సిరిసిల్ల, సిద్ధిపేటకే పరిమితమైందన్న రాజగోపాల్.. హుజూరాబాద్‌లో పోయిన పరువును ప్రలోభాలతో కాపాడుకోవాలని కేసీఆర్ చూస్తున్నారని ఆరోపించారు. ఉప ఎన్నిక వస్తే తెలంగాణ రాజకీయాలు మారిపోతాయని అన్నారు. ఇదిలా ఉంటే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డితో కాంగ్రెస్ నేతల చర్చలు విఫలమయ్యాయి. ఏఐసీసీ దూతలుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, వంశీచంద్ రెడ్డిలు రాజగోపాల్ రెడ్డితో భేటీ అయినా ఫలితం లేకుండా పోయింది. రాహుల్ మాటగా ఢిల్లీ రావాలని, పార్టీ మార్పుపై తొందరపాటు నిర్ణయంతీసుకోవద్దని ఇరువురు నేతలు కోరినట్లు తెలుస్తోంది. అయితే వారి విజ్ఞప్తిని రాజగోపాల్ తోసిపుచ్చినట్లు సమాచారం. అవసరముంటే తన వద్దకే వచ్చి మాట్లాడాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఏఐసీసీ దూతలుగా వచ్చిన ఉత్తమ్, వంశీచంద్‌లు నిరాశతో వెనుదిరిగినట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ని పార్టీ సీనియర్ నేతలు బుజ్జగించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా ఉదయం రాజగోపాల్‌తో ఏఐసీసీ సెక్రటరీ వంశీచంద్ రెడ్డి చర్చలు జరిపారు. అనంతరం వంశీ చంద్ మీడియాతో మాట్లాడుతూ... రాజగోపాల్ రెడ్డి కరుడుగట్టిన కాంగ్రెస్ వాది అని చెప్పుకొచ్చారు. రాజగోపాల్ రెడ్డి పార్టీ వీడరని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయరని స్పష్టం చేశారు. ఉప ఎన్నిక వచ్చే అవకాశం లేదన్నారు. తాను రాజగోపాల్ రెడ్డిని తరుచూ కలుస్తుంటానని తెలిపారు. టీఆర్ఎస్‌తో పోట్లాడేది కాంగ్రెస్ మాత్రమే అని అన్నారు. బీజేపీ నేత బండి సంజయ్ మాటలు ఉత్తయే అంటూ కొట్టిపారేశారు. హైదరాబాద్ వరదలు వచ్చినప్పుడు బండి సంజయ్ చేసిన వాఖ్యలే నిదర్శనమని వంశీ చంద్ రెడ్డి పేర్కొన్నారు.



# ఒక్కశాతం ఉన్న వారి పెత్తనం ఇంకెంతకాలం

## కెసిఆర్ కుట్రల భరించలేకే ప్రజల మధ్యకు వచ్చా

## బిఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**రాజన్న సిరిసిల్ల, జూలై 30 (సమ సమాజం):** ఆకలితో నైనా చస్తాం కానీ.. ఆత్మ గౌరవం పోగొట్టుకోము.. కేసీఆర్ కుట్రలు భరించలేకే ప్రజల మధ్య ఉంటున్నానని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాలులో విశ్వ కర్మీయుల పట్ల కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ నిర్వహించిన 'చలో సిరిసిల్ల' ఆత్మగౌరవ జిల్లా సదస్సులో ఆర్ఆఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆనాడు నాగరికతలో పని ముట్లు ఇచ్చింది విశ్వ కర్మలేనని గుర్తు చేశారు. సిరిసిల్లలో సభ వద్దంటూ పోలిసుల నుండి బెదిరింపులకు పాల్పడుతు న్నారని ఆరోపించిన ఆయన .. గడిల పాలన అక్కడి నుండే కొనసాగుతోందని విమర్శించారు. నేను 26 ఏళ్ల పాటు పోలీసు అధికారిగా పని చేశా... మీ నాయన కెసిఆర్ పెట్టే కుట్రలు భరించలేక బయటకు వచ్చి ప్రజల మధ్యలో ఉంటున్న...ఈనాడు సిరిసిల్ల ఒక్కటే కాదు.. మొత్తం తెలంగాణ ప్రజలు బాధపడు తున్నారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అమెరికాలో కేటీఆర్ నేర్చుకుంది ఇదేనా.. కేటీఆర్ కి అహంకారం ఎక్కడి నుండి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. కేవలం ఒక్క శాతం ఉన్నోళ్లు మనల్ని శాసిస్తున్నారని ఆయన విమర్శించారు. శ్రీకాంతాచారి ఆత్మబలిదానం ద్వారానే తెలంగాణ వచ్చిందని, ప్రొఫెసర్ జయశంకర్ సార్ సిద్ధాంతాల ద్వారానే తెలంగాణ సాకారమైందన్నారు. కేటీఆర్ బర్త్ డే కి పోకపోతే బెల్లంపల్లి లో ముగ్గురూ ఉద్యోగులకు మెమో ఇచ్చారని ప్రస్తావిస్తూ.. ఇలాంటి భూ స్వామ్య రాజరిక పాలన పోవాలని ప్రవీణ్ కుమార్ కోరారు. రాష్ట్రంలో బడుగు బలహీనులు ఒక్కటి కావాలి, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమ భవనంలో 9ఏళ్లు పని చేశా.. చిన్న చిన్న పనుల కోసం అక్కడ సెక్యూరిటీ గార్డు కాల్లు మొక్కు తుండే.. ప్రగతి భవన్?లో లోపలికి ఎవర్ని రానివ్వడు..పంజాగుట్ట రోడ్డును ఆక్రమించుకున్నారు.. మనం కలిసి కట్టుగా లేకనే వాళ్లు రాజ్యం ఏలుతున్నరు.. కేటిఆర్ ఎన్ని కుట్రలు చేసినా సిరిసిల్లలో సభ సక్సెస్ అయింది.. ఒకరి కింద ఒకరు కాదు..ఒకరి నొకరు కలిసి ఉందాం..' అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. మనం ఒక్కటిగా లేనంత వరకు అవమానాలు జరుగుతూనే ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# మా లాగా మీ రాష్ట్రాల్లో కష్టపడండి

## కేంద్రమంత్రి సింధియా విమర్శలకు కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** తెలంగాణపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఘాటుగా స్పందించారు. పాలనలో విఫలమైన రాష్ట్రాల్లోని బీజేపీ నాయకుల చిత్తశుద్ధిని మీరు నిజంగా మెచ్చుకోవాలని సింధియాను ఉద్దేశించి కేటీఆర్ ట్వీట్ చేశారు. వారు తెలంగాణకు వచ్చి విభజన రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా తాను ధైర్యంగా సింధియాకు సవాల్ చేస్తున్నాను. మీ సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో తెలంగాణలో కంటే మెరుగైనా అభివృద్ధి జరిగి ఉంటే చూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. దేశ జనాభాలో 2.5 శాతం ఉన్న తెలంగాణ జనాభా.. దేశానికి 5 శాతం జీడీపీని కంట్రిబ్యూట్ చేస్తుందని కేటీఆర్ మరో ట్వీట్ చేశారు. ప్రతి తెలంగాణ పౌరుడు ఈ దేశానికి డబుల్ ఇంజిన్‌గా దోహదపడ్డాడని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం లాగే బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా కష్టడితే 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ఈ దేశం 10 ట్రిలియన్ల ఎకానమీకి చేరుకునే అవకాశం ఉండేదన్నారు కేటీఆర్.




# దేశంలో కొత్తగా 20,408 కరోనా కేసులు

**న్యూఢిల్లీ, జూలై 30 (సమ సమాజం):** దేశంలో కొత్తగా 20,408 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసులు 4,40,00,138కి చేరాయి. ఇందులో 4,33,30,442 మంది బాధితులు కోలుకున్నారు. ఇప్పటివరకు 5,26,312 మంది కరోనాతో మృతిచెందారు. మరో 1,43,384 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కాగా, శుక్రవారం ఉదయం నుంచి ఇప్పటివరకు 54 మంది మరణించగా, 20,958 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. రోజువారీ పాజిటివిటీ రేట 5.05 శాతంగా ఉందని తెలిపింది. మొత్తం కేసుల్లో 0.33 శాతం కేసులు యాక్టివ్‌గా ఉన్నాయని, రికవరీ రేటు 98.48 శాతం, మరణాలు 1.20 శాతంగా ఉన్నాయని పేర్కొన్నది.

# ప్రజలు వరదల్లో మునిగి ఉంటే ఢిల్లీలో రాజకీయాలా

## మండిపడ్డ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** ప్రకృతి వైపరీత్యం వరదలతో రాష్ట్రం అతలాకుతులం అవుతుంటే కేసీఆర్ ఢిల్లీ పర్యటన ఏంటి అంటూ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... వరదలతో లక్షల ఎకరాల పంట నష్టపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు పొందే ప్రయత్నం చేయకుండా కేసీఆర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతుంటే పసల్ బీమా లేదు.. ఇన్పుట్ సబ్సిడీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందకపోవడానికి సీఎం కేసీఆర్ అసమర్థతే కారణమని ఆయన విమర్శించారు. వరద సహాయం పొందటం తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కు అని స్పష్టం చేశారు. అసమర్థతకు కేసీఆర్ చిహ్నామని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకొచ్చిన ప్రాజెక్టుని నిలుపుకోవడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమయిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కు జాతీయ ఆదాయం ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. కమీషన్ల కక్కుర్తికి కాళేశ్వరం ప్రాజెక్టుకి జాతీయ హోదా రాలేదని జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# టిఆర్ఎస్ బంధుగా మారిన దళితబంధు

## పది లక్షలకు రెండు లక్షల కమిషన్ వసూలు


## కాంగ్రెస్ నేత మల్లురవి ఆరోపణలు

**హైదరాబాద్, జూలై 30 (సమ సమాజం):** దళిత బంధు కాదు.. అది టీఆర్ఎస్ బంధు అని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. రూ. 10 లక్షలు ఇచ్చి ఇచ్చి రూ. 2 లక్షలు లబ్దిదారుల నుంచి కమిషన్‌గా వసూలు చేస్తున్నారని మాజీ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. దళిత బంధు ద్వారా దళితులు బాగుపడాలి.. కానీ దీని ద్వారా టీఆర్ఎస్ బాగుపడుతోందన్నారు. టీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేల బంధువులకే దళిత బంధు వస్తోందని.. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదన్నారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ కు ఓట్లు వేస్తేనే దళిత బంధు ఇస్తామని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి బహిరంగంగా చెబుతున్నాడని గుర్తు చేశారు. భారతదేశంలో అన్ని కులాల, మతాల వారు కలిసి మెలసి ఉంటున్నారు అంటే కారణం కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రీతం మాట్లాడుతూ.. టీఆర్ఎస్ కు ఓట్లు వేసే వాళ్ళకే దళిత బంధు ఇస్తామని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి వ్యాఖ్యానిస్తున్నారని... ఆయనకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. దళితులను కించ పరిచే మాటలు మాట్లాడిన ముత్తిరెడ్డి మీద చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ లో దళితుల భూమి కబ్జా చేశారని ఈటలను బర్తరఫ్ చేశారని, ముత్తిరెడ్డి భూకబ్జాలు చేశారు..తాను నిరూపిస్తానని స్పష్టం చేశారు. రూ. 10 లక్షలు కాదు ఆత్మ గౌరవం కావాలి.. టీఆర్ఎస్ కరీంనగర్ మున్సిపల్ ఛైర్మన్ వాళ్ల బంధువులకు దళిత బంధు ఇప్పించుకున్నారని విమర్శించారు.









## న్యూ లుక్‌లో అదరగొట్టిన బన్నీ

పుష్పను మించి ఉందంటూ సోషల్ మీడియాలో కామెంట్స్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ న్యూ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ తెగ వైరల్ అవుతోంది. అల్లు అర్జున్ కెరీర్‌లో ఎప్పుడూ లేనంత మాసీవ్‌గా పుష్ప సినిమాలో కనిపించిన సంగతి తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప అదరగొట్టింది. ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్‌గా, సమంత స్పెషల్ సాంగ్‌లో కనిపించి సందడి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాది డిసెంబర్‌లో రిలీజైన ఈ సినిమా అద్భుతమైన వసూళ్లను రాబట్టింది.ఇక ఈ సినిమాకు సీక్వెల్ ప్లాన్ చేసిన మేకర్స్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్స్ వర్క్‌లో ఉన్నారు. సీక్వెల్‌లోనూ అదే లుక్‌లో కనిపిస్తారని అందరూ భావిస్తున్న సమయంలో ఇలా సరికొత్త లుక్‌లో దర్శనమిచ్చి ఫ్యాన్స్‌కి సర్‌ప్రైజ్ ఇచ్చి సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. ఇప్పుడు ఇదే లుక్‌తో పుష్ప సీక్వెల్ మూవీలో కనిపించబోతున్నారని, అందుకే ఈ మాస్ లుక్‌ని రివీల్ చేశారని మాట్లాడుకుంటున్నారు. అయితే, 'విక్రమ్' సినిమాలో సూర్య పోషించిన రోలెక్స్ పాత్ర తరహాలో ఉన్న బన్నీ లుక్ మూవీ కోసం కాదు. ఓ కమర్షియల్ యాడ్ కోసం. ఈ యాడ్ ఫిల్మ్ ని హరీష్ శంకర్ దర్శకత్వం వహించాడు. ఇక ఈ లుక్ విషయానికొస్తే..నోట్లో సిగార్ పెట్టుకొని నల్ల కళ్లజోడుతో జుట్టు కాస్త తెల్లబడి పక్కా మాస్.. అనిపిస్తున్నారు. ఏదేమైనా అల్లు అర్జున్ తాజా లుక్ మాత్రం విపరీతంగా ఆకట్టుకుంటోంది.



## చిత్ర పరిశ్రమలో ఐదు దశాబ్దాల చలనం

సహజనటిగా ప్రేక్షకుల ఆదరాభిమానాలు

నటి జయసుధ ప్రత్యేకతే వేరు

సహజనటనకు మారుపేరు జయసుధ. పద్నాలుగేళ్ళ వయసులోనే సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చి, తన సహజ నటనతో ప్రేక్షకులలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు జయసుధ. 1972లో వచ్చిన 'పండంటి కాపురం' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైన ఈమె అనతి కాలంలోనే అప్పటి అగ్ర కథానాయకులతో జోడీ కట్టి స్టార్ హీరోయిన్‌గా వెలుగొందింది. ఐదు దశాబ్దాల పాటు నటిగా ఎన్నో వైవిధ్య భరిత పాత్రలు పోషించి పరిశ్రమలో తన కంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. ప్రస్తుతం ఈమె క్యారెక్టర్ ఆర్టిస్టుగా బిజీ బిజీగా గుడుపుతుంది. కాగా తాజాగా జయసుధ ఓ ఇంటర్వ్యూలో తన 50ఏళ్ళ సినీ కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులను చూశానని చెప్పింది. అంతేకాకుండా ఇండస్ట్రీపై, హీరోయిన్‌లపై వివక్ష గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది.'50ఏళ్ళు పూర్తి చేసుకున్నందుకు బాలీవుడ్‌లో అయితే ఫ్లవర్ బొకేలైనా పంపేవారని, ఇక్కడ ఫ్లవర్ బొకేలు కూడా పంపించినవారు లేరని.. అదే హీరోలకైతే హడావిడి చేశారని' తెలిపింది. చాలా మంది తనతో మీరెందుకు పెద్ద పార్టీ ఇచ్చి 50 ఏళ్ళ సక్సెస్ ఫుల్ జర్నీను సెలబ్రెట్ చేసుకోకూడదని అన్నారని , కానీ తనకది వద్దని అనిపిందని తెలిపింది. స్టార్ హీరోయిన్ అయినా వివక్ష ఉంటుందని.. తను ఎక్కువగా డిమాండ్ చేసిన, ట్రబుల్ చేసిన 50ఏళ్ళు తనను ఇండస్ట్రీలో ఉంచేవారు కాదని తెలిపింది. టాలీవుడ్‌లోకి ముంబై నుండి హీరోయిన్ వస్తే ఒకలా ట్రీట్ చేస్తారని, కుక్క పిల్లకు కూడా ఒక రూమ్ ఇస్తారని సంచలన విషయాలను చెప్పింది. కంగానా రనౌత్‌కు పద్మశ్రీ ఇచ్చారని.. అలాంటప్పుడు ఇన్నేళ్ళు ఇండస్ట్రీలో ఉంటున్న తనకు ఎందుకు పద్మశ్రీ ఇవ్వలేదని చాలా మంది అడిగినట్లు తెలిపింది. అంతేకాకుండా మా బిల్డింగ్ గురించి, పాలిటిక్స్ గురించి కూడా పలు విషయాలను ఈ ఇంటర్వ్యూలో తెలిపింది.

## తక్కువ సినిమాలే అయినా పాపులారిటీ ఎక్కువే

మురుగదాస్ సినిమాలంటే అందరీకి క్రేజీయే



ప్రముఖ కోలీవుడ్ దర్శుకుడు ఏ ఆర్ మురగ దాస్ తన తదుపరి సినిమాను అదే కోలీవుడ్ స్టార్ హీరోతో చేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్టుగా తాజా సమాచారం. మురగదాస్ ఇప్పటివరకు చేసింది తక్కువ సినిమాలే అయినా వాటితో మంచి పాపులారిటీని సంపాదించుకున్నారు. అజిత్ హీరోగా చేసిన మొదటి సినిమా దిన. ఆ తర్వాత చేసిన రమణ భారీ హిట్ సాధించింది. అదే సినిమాను తెలుగులో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఠాగూర్ గా రూపొంది భారీ హిట్ సాధించింది.మురగదాస్ నుంచి వచ్చిన చిత్రాలు గజిని, స్టాలిన్, సెవెంత్ సెన్స్, తుపాకి, జయహో, కత్తి, స్పైడర్, దర్బార్. వీటిలో గజిని, తుపాకి, కత్తి భారీ హిట్ సాధించాయి. అయితే, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా స్పైడర్, కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్హీరోగా దర్బార్ చిత్రాలు రూపొందించగా అవి డిజాస్టర్‌గా నిలిచాయి. ముఖ్యంగా దర్బార్ మూవీ మురగదాస్‌ని తీవ్రంగా నిరాశపరిచింది. ఈ మూవీ నిర్మాతలకు భారీ నష్టాలను మిగిల్చింది. దాంతో దాదాపు రెండేళ్ళు గ్యాప్ తీసుకున్న ఆయన, ఇప్పుడు తన కొత్త చిత్రాన్ని తమిళ హీరో శింబు తో చేసేందుకు ఎ÷-లాన్ చేసుకుంటున్నారట. శింబు వరుస హిట్స్‌తో మంచి ఊపు మీదున్నారు. ప్రస్తుతం కూడా కొన్ని సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. ఈ క్రమంలోనే మురగదాస్ దర్శకత్వంలో కూడా ఓ ప్రాజెక్ట్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.



## ర్యాంప్ వాక్‌లో అదరగొట్టిన రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. తెలుగు, తమిళంలోనే కాకుండా హిందీలోనూ వరుస సినిమాలతో దూసుకెళ్తుంది. ఇలా ఏ మాత్రం తీరక లేకుండా షూటింగ్స్‌తో బిజీగా ఉన్న రష్మిక..ఇటీవల ఓ ఫ్యాషన్ షోలో పాల్గొంది. ఇండియన్ కోచర్ వీక్ 15వ ఎడిషన్ కోసం రష్మిక తొలిసారి ర్యాంప్ వాక్ చేసింది. ఎరుపు రంగు ఎంబ్రాయిడరీ లెహంగా ధరించి, చిరునవ్వులు చిందిస్తూ రష్మిక చేసిన ర్యాంప్ వాక్ నెట్టింట తెగ వైరల్ అయింది. తాజాగా తన తొలి ర్యాంప్ వాక్ అనుభవం గురించి చెప్పుకుంటూ తనకు సహాయం చేసిన వ్యక్తికి సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపింది రష్మిక. 'ఢిల్లీలో మొదటిసారి ఫ్యాషన్ వీక్‌లో పాల్గొన్నాను. నేను ప్రో మోడల్ లాగా నడవడానికి చాలా ప్రయత్నం చేశాను.. కానీ అది వర్కౌట్ కాలేదు. నేను కేవలం నవ్వుతూ సరదాగా గడిపే నాకు ఈ ఫ్యాషన్ షో ఓ బ్లాస్ట్‌లా ఉంది. నా తొలి నడకకి సహాయం చేసిన వరుణ్‌కి థ్యాంక్స్. ఈ ర్యాంప్ వాక్ నాకు ఎప్పటికీ గుర్తిండిపోతుంది. నేను మీ కళను ప్రేమిస్తున్నాను. మనం కలిసి మరిన్ని పనులు చేయాలని కోరుకుంటున్నాను. నాకు సహాయం చేసిన అందరికి కృతజ్ఞతలు' అంటూ రషజ్మక రాసుకొచ్చింది.

## దోచేవారెవరురా సినిమా టీజర్ విడుదల



బొడ్డు కోటేశ్వరరావు నిర్మాతగా సీనియర్ దర్శకుడు శివ నాగేశ్వరావు తెరకెక్కిస్తున్న సినిమా 'దోచేవారెవరురా'. ఇప్పటికే దర్శకుడు రాంగోపాల్ వర్మ చేతల మీదుగా విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. దాంతోపాటు లిరికల్ సాంగ్‌కు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా నుంచి మరో అప్డేట్ ఇచ్చారు దర్శక నిర్మాతలు. దర్శక ధీరుడు రాజమౌళి చేతుల మీదుగా 'దోచేవారెవరురా' సినిమా టీజర్ విడుదల చేశారు. దర్శక ధీరుడు రాజమౌళి మాట్లాడుతూ.. 'నేను శివ నాగేశ్వరరావు సినిమాల్లోని కామెడీ, ఎంటర్‌టైన్మెంట్ బాగా ఎంజాయ్ చేస్తాను. ఈయన తెరకెక్కిస్తున్న 'దోచేవారెవరురా' కూడా అంతే ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందని నమ్ముతున్నాను. ఈ సినిమా టీజర్ విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. కాగా, అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఆగస్టులో సినిమాను విడుదల చేస్తామని తెలిపారు మేకర్స్. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేయనున్నారు.

## కొందరి స్వార్థం కోసం స్ట్రయిక్ చేస్తారా

**ఎవరు అడ్డు వచ్చినా షూటింగ్స్ ఆపేది లేదు**

**తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్**

తెలుగు ఫిల్మ్ ఇండస్టీ ఎదుర్కొంటున్న సమస్యలు, ఆగస్టు 1 నుంచి జరగనున్న స్ట్రయిక్‌పై తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్పందించారు. శనివారం తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కొందరి స్వార్థం కోసం స్ట్రయిక్ చేస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో యాభైకి పైగా చిన్న సినిమాల షూటింగ్స్ జరుగుతున్నాయి. ఎవరు అడ్డు వచ్చినా షూటింగ్స్ ఆపేది లేదు. నలుగురైదుగురు నిర్మాతల వల్ల షూటింగ్స్ ఆపడం సరైంది కాదు. అలాగే కొందరి చేతుల్లోనే థియేటర్స్ పెట్టుకున్నారు. వాళ్లకు ఎలా ఇష్టమైతే అలా చేయడం అస్సలు కరెక్ట్ కాదు. చిన్న సినిమాలకి థియేటర్స్ ఇవ్వరు. ఓటీటీలకు ఇవ్వొద్దు అంటున్నారు. ఆ పది మంది ప్రొడ్యూసర్లే బతకాలా?. ఇండస్ట్రీపై ప్రేమ ఉంటే పర్సెంటేజ్ ప్రకారం థియేటర్స్ ఇవ్వాలి. పెద్దవి 40 వస్తే.. చిన్న సినిమాలు 200 పైన రిలీజ్ అవుతాయి. టికెట్స్ ధరలు పెంచమని చెప్పింది కూడా వీళ్ళే. వాళ్ళే సినిమా టికెట్ ధరలు పెంచాలని ప్రభుత్వం దగ్గరికెళ్లారు. ఈ విధానం కూడా మార్చాలి. టికెట్ రేటు వంద కంటే ఎక్కవ పెంచకూడదు. పాప్‌కార్న్ కొనాలంటే రూ.200, వాటర్ కొనాలంటే రూ 70. ఇవి ఎందుకు తగ్గించరు? ఒక ఫ్యామిలీ మూవీకి వెళ్లాలంటే రెండు నుంచి మూడు వేలు ఖర్చవుతోంది. ఇంత ఖర్చు చేయడానికి ఎవరు ముందుకొస్తారు? పెరిగిన ధరలకు జనాలు థియేటర్ లకి రాకపోతే... ఇప్పుడు షూటింగ్ లు ఆపాయలంటున్నారు. అది కుదరదు. స్టైక్ర్ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా. ఒక్క సినిమా హిట్ అయితే హీరోకి వంద కోట్లు రెమ్యునరేషన్ ఇస్తారా? అంత ఎవరివ్వమన్నారు? ఓటీటీ విషయంలో కూడా ఆలోచించాలి. ఓటీటీకి సినిమాలు ఇవ్వొద్దనే అధికారం సో కాల్డ్ నిర్మాతలకు లేదు. చిన్న సినిమాలకు థియేటర్లు ఇవ్వనప్పుడు ఓటీటీలే ఆదుకుంటున్నాయి. నేషనల్ అవార్డ్స్ వచ్చిన కలర్ ఫొటో, నాట్యం సినిమాలకి థియేటర్లు ఇవ్వలేదు. 'కలర్ ఫోటో' ఓటీటీలోనే రిలీజయ్యింది. కాబట్టి పెద్ద సినిమా రెండు వారాలకి, చిన్న సినిమా ఒక వారానికి ఓటీటీకి రావాలి. సినిమా అనేది ప్రేక్షకులకు భారం కాకుండా చూడాలి' అన్నారు. వైస్ ప్రెసిడెంట్ గురురాజ్ మాట్లాడుతూ 'కొందరు సినిమా ఇండస్ట్రీని శాసించే స్థాయి కి వెళ్ళారు. ఇప్పుడున్న పెద్ద నిర్మాతలు ఒకప్పుడు చిన్నవాళ్లు కాదా. మీ ఏకథాటి నిర్ణయాల వలన చిన్న నిర్మాతలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రేక్షకులు భయపడేలా చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ షూటింగ్స్ ఆపేది లేదు' అని చెప్పారు. జనరల్ సెక్రెటరీ సాగర్, మెట్రో స్టూడియో అధినేత ఈవీఎన్ చారితో పాటు మరికొందరు నిర్మాతలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మష్కూకా సాంగ్‌లో రకుల్ అదుర్స్




తెలుగుతో పాటు తమిళ, హిందీ భాషల్లోనూ బిజీగా ఉంది రకుల్ ప్రీత్ సింగ్. ఇంత బిజీలోనూ ఒక ప్యాన్ ఇండియా మ్యూజికల్ వీడియో చేసింది. 'మాషూకా' అంటూ సాగే ఈ పాట హిందీ వెర్షన్ ఆల్రెడీ రిలీజయింది. తెలుగు, తమిళ వెర్షన్స్‌ని అల్లు అర్జున్ సోషల్ మీడియాలో లాంచ్ చేశాడు. రకుల్‌కి, టీమ్‌కి బెస్ట్ విషెస్ చెప్పాడు. తనిష్క్ బాగ్చి మ్యూజిక్ అందించిన ఈ పాటను తెలుగులో ఆదిత్య అయ్యంగార్, అసీస్ కౌర్ పాడారు. 'నీ నవ్వుకు పడిపోయా, నీ చూపుకు పడిపోయా, నా నిదరే చెడిపోయా.. నా నలువైపుల నీ మాయ, లోలోపల నీ మాయ, నీ ప్రేమలో దిగిపోయా' అంటూ రామజోగయ్య శాస్త్రి క్యాచీ లిరిక్స్ రాశారు. స్టైలిష్ లుక్‌తో తనదైన డ్యాన్స్ మూమెంట్స్‌తో ఇంప్రెస్ చేసింది రకుల్. ఆమె రీసెంట్‌గా అటాక్, రన్‌వే 34 చిత్రాలతో బాలీవుడ్ ఆడియెన్స్‌ని ఆకట్టుకుంది. ప్రస్తుతం మిషన్ సిండ్రెల్లా, డాక్టర్ జి, థ్యాంక్ గాడ్, ఛత్రీవాలీ లాంటి హిందీ సినిమాల్లో నటిస్తోంది. శివ కార్తికేయన్‌తో కలిసి చేసిన తమిళ మూవీ 'అయలాన్' రిలీజ్‌కి రెడీ అవుతోంది. తెలుగు, తమిళ బైలింగ్వల్ మూవీ '31 అక్టోబర్ లేడీస్ నైట్' సెట్స్‌పై ఉంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in